క్లుప్తంగా

మాజీ మంత్రికి శుభాకాంక్షలు



మక్తల్: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పుట్టినరోజు సందర్భంగా మహబూబ్ నగర్ పట్టణంలో మక్తల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహగౌడ్, శ్రీనివాస్ గుప్తా, మాజీ సర్పంచు గోవర్ధన్‌రెడ్డి, అశోక్‌కుమార్, బాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రేషన్ బియ్యం దందా

మాగనూర్: మండలంలో రేషన్ దందా జోరుగా సాగుతోంది. పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం వివిధ మార్గాల్లో కర్ణాటక రాష్ట్రానికి తరలుతోంది. కొందరు వ్యాపారులు మాఫియాగా ఏర్పడి వివిధ మార్గాల్లో రేషన్ బియ్యం తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందూరు మండలంలోని మాగనూర్, వర్కూర్, నేరడగం, వడ్వాట్, మందిపల్లి, కోల్పూర్, ఉజ్జెల్లి తదితర గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని కిలోకు రూ.16 చొప్పున సేకరిస్తున్నారు. అక్కడ నుంచి కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు తరలించి వ్యాపారులకు రూ.22 నుంచి రూ.25 వరకు విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇసుక అక్రమ రవాణా

మాగనూర్: మండలంలోని అమ్మపల్లి, వడ్వా ట్ గ్రామాల్లోని పెద్దవాగు నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వేసవి కాలం మొదలు కావ డంతో ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటి ఒకవైపు రైతులు ఇబ్బందులు పడుతుంటే, మరో వైపు అక్రమార్కులు జేసీబీ, ట్రాక్టర్లతో నిత్యం ఇసుక తరలిస్తున్నారు. కొన్ని రోజులుగా రాత్రి 10 గంటలు దాటిందంటే చాలు జోరుగా ఇసుక రవాణా సాగిస్తున్నారు. ఇంతలా ఇసుక రవాణా జరుగుతున్న సంబంధిత అధికారులు ఇటు వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపి భూగర్భ జలాలను రక్షించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

ధన్వాడ: అనుమతి లేకుండా రాత్రి సమయంలో కొంత మంది అక్రమంగా మొర్రం తరలిస్తున్నారు. ధన్వాడ శివారులోని మనిపూర్ తండా వద్ద ఉన్న గుట్టల నుంచి మట్టిని రోజు రాత్రి సమయంలో తరలిస్తున్నారు. పోలీసులు పెట్రోలింగ్ వాహనాల ముందు నుంచే మట్టి తరలుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమ మట్టి తరలింపును అరికట్టి గుట్టను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వర్గీకరణ తరువాతే నియామకాలు చేపట్టాలి

నారాయణపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలకు అన్యాయం చేయకుండా ఎస్సీ వర్గీకరణ అమలు చేశాకే ఉద్యోగాల భర్తీ చేపట్టాలని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న గ్రూప్ 1,2,3 ఉద్యోగాల భర్తీ చేపట్టాలని తెలిపారు. ఇప్పటికైనా అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం పొంది ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

అమరచింత: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి జీఎస్.గోపి తెలిపారు. మండలంలోని అమరచింత పట్టణంలోని 1 వ వార్డుతో పాటు నందిమళ్ల గ్రామంలో ఆదివారం పర్యటించి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీపీఎం నాయకులు వెంకటేష్, అజయ్, శ్యాంసుందర్, ఆర్ఎస్.రమేష్, రాఘవ, చంటి, రాఘవేంద్ర పాల్గొన్నారు.



కాల్వ భూములు కబ్జా!



నేరడగం సమీపంలో కనుమరుగైన దారి

- నష్టపరిహారం పొంది తిరిగి ఆక్రమణ
- యథేచ్ఛగా చదును చేస్తున్న రైతులు
- ఆక్రమణ వల్ల రాకపోకలు, మరమ్మతులకు ఆటంకం
- పట్టించుకోని అధికారులు

మాగనూర్: ప్రతి చెరువుకు కృష్ణా జలాలు అందించాలనే లక్ష్యంతో సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను మాగనూర్ నేరడగం నుంచి కృష్ణ మండలం వరకు హైలెవల్ కాల్వ నిర్మించారు. హైలెవల్ 40 కిలోమీటర్లు, 24.40 కిలోమీటర్ల ఆర్‌సీఎం కాల్వ పొడవు లో లెవల్ 20.6 కిలోమీటర్లు, 19.6 కిలోమీటర్ల ఆర్‌సీఎం ఉంది. నేరడగం నుంచి పెగడబండ గ్రామం వరకు కుడి లో లెవల్ కాల్వ నిర్మించారు. ఈ కాల్వలకు ఇరువైపులా ఉన్న రోడ్ల భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. గతంలో కాల్వల నిర్మాణం కోసం రైతుల నుంచి భూములు సేకరించి పరిహారం చెల్లించారు. అనంతరం కాల్వలను నిర్మించగా ఇరువైపులా రోడ్డు కోసం విడిచిపెట్టిన భూములపై సమీప రైతుల కన్ను పడింది. దీంతో సదరు భూములను చదును చేసి ఆక్రమించుకునే పనిలో పడ్డారు. ఇప్పటికే కొందరు ఆ భూములను ఆక్రమించి పంట సాగు చేస్తున్నారు.

మాగనూర్ మండలంలో..

ఇప్పటికే మాగనూర్ మండలంలోని నేరడగం, తళంకేరి, కొత్తపల్లి, మాగనూర్, పెగడబండ, తదితర గ్రామాల్లో భూములను ఆక్రమించి సాగు చేస్తుండగా, వారిని చూసి మిగతా రైతులు సైతం అదేబాట పట్టారు.

పలుచోట్ల కల్లాల ఏర్పాటు..

కాల్వ భూముల్లో పలుచోట్ల రైతులు సాగు పనులు చేస్తూ, మరికొన్ని చోట్ల పంటను ఆరబెట్టుకునే కల్లాలను ఏర్పాటు చేశారు. కాల్వల నిర్మాణ సమయంలో హద్దులుగా ఏర్పాటు చేసిన పెద్దపెద్ద బండరాళ్లను తొలగించి ఆక్రమించే పరిస్థితులు ఉన్నాయి. చాలా చోట్ల హద్దుల కోసం ఏర్పాటు చేసన మొర్రం కుప్పలను విక్రయించి సదరు భూములను ఖాళీ చేయిస్తున్నారు.

కొన్ని ఏళ్లుగా ఆక్రమణలు..

కొన్ని ఏళ్లుగా కాల్వ భూముల ఆక్రమణల పర్వం కొనసాగుతున్నా.. ఒక్కరూ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో ఆయా గ్రామాలకు చెందిన పలువురు ఆక్రమణల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన దాఖలాలున్నాయి. కానీ ప్రస్తుతం దీనిపై ఒక్కరు కూడా స్పందించడం లేదని రైతులు బాహటంగానే విమర్శిస్తున్నారు. కాల్వ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించారు. ఆ సమయంలో మిగిలిన గుంట, రెండు గుంటల భూమిని తీసుకొని పరిహారం చెల్లించాలన్న రైతుల విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించింది. ప్రస్తుతం మిగిలిన భూములతో పాటు కాల్వకు ఇరువైపులా రోడ్డు కోసం విడిచిపెట్టిన భూములను తిరిగి ఆక్రమించుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టకుంటే కాల్వకు ఇరువైపులా ఉన్న రోడ్డు మాయమయ్యే పరిస్థితి తలెత్తుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేసులు నమోదు చేస్తాం..



హై లెవల్, లో లెవల్ కాల్వ పక్కన 30 ఫీట్ల మేర రోడ్డు ఉంటుంది. కాల్వల పరిశీలనకు వచ్చిన ప్రతిసారి రైతులకు నిబంధనలు పాటించాలనే చెబుతున్నాం. అయినప్పటికీ కొందరు రైతులు రోడ్డు భూములను చదును చేస్తున్నారని మా దృష్టికి వచ్చింది. ముఖ్యంగా కాల్వ మరమ్మతులకు, పరిశీలనకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయి. ఈ విషయంపై తహసీల్దార్‌కు సమాచారం అందించాం. వెంటనే భూములను పరిశీలించి కాల్వ భూములను ఆక్రమించి వ్యక్తులపై కేసులు నమోదు చేస్తాం.

– భానుచందర్, ఏఈ, ఇరిగేషన్ శాఖ



నేరడగం జీరో పాయింట్ దగ్గర నిల్వ ఉంచిన మొర్రం తరలించి వరి సాగు చేసిన రైతు

రాష్ట్ర కమిటీలో నారాయణపేటకు పెద్దపీట



రాష్ట్ర సభ్యులుగా ఎన్నికైన సభ్యులు

నారాయణపేట రూరల్: సోమ వంశీయ క్షత్రీయ(ఎస్ఎస్‌కే)సమాజ్ రాష్ట్ర కార్యవర్గం ఆదివారం హైదరాబాద్‌లో ఎన్నుకున్నారు. కార్యవర్గంలో నారాయణపేటకు పెద్దపీట వేశారు. కార్యవర్గంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నాగురావు నామాజీ, సీఎంసీ సభ్యులుగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ, యువజన విభాగం ఉపాధ్యక్షుడు కమలపూర్ శ్రీనివాస్, రాష్ట్ర యువజన విభాగం సభ్యులుగా చందు, ఉమాకాంత్, సందీప్, శ్రీకాంత్, నారాయణ, వినోద్ లు నియమించబడ్డారు. వీరంతా ప్రమాణ స్వీకారం చేశారు.

సమాజ్ అభివృద్ధిలో పాలు పంచుకోవాలి

ఎస్ ఎస్ కే సమాజ్ రాష్ట్ర కమిటీలో ఎన్నికైన వారంతా సమాజం అభివృద్ధికి పాటు పడాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగురావు నామాజీ పిలుపునిచ్చారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్ ఎస్ కే సమాజ్‌లో అనేక మంది వెనుకబడిన వారు ఉన్నారని వాటిని వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు చేయూత ఇవ్వాలన్నారు. విద్య, వైద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించినప్పుడే సమాజ్ ప్రజలు బాగుపడతారన్నారు. అందుకు అందరూ కృషి చేయాలని కోరారు.

ఉగాది మహోత్సవ అవార్డులు అందజేత

మక్తల్: 33 సంవత్సరాల నుంచి ఉగాది మహోత్సవ సువర్ణ కంకణ గోల్డ్‌మెడల్ అవార్డులను ఆదివారం హైదరాబాద్‌లో హరిహర కళాభవనంలో మక్తల్‌కు చెందిన శ్రీమల్లికార్జున స్వామి పూజారి తిప్పయ్యస్వామికి బ్రహ్మశ్రీ శ్రీకృష్ణ చామండేశ్వరి మహర్షి, మహేంద్రవాడ వెంకటేశ్వరరావు చేతుల మీద ఉగాది పుష్కర గోల్డ్ మెడల్ అవార్డును అందుకున్నారు. మక్తల్‌లో తిప్పయ్యస్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టడం, ప్రజలకు ఉచిత సేవలు, ఆధ్యాత్మిక సేవలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. అవార్డు రావడం పట్ల తిప్పయ్యస్వామిని అభినందించారు.



ఉగాది పుష్కర గోల్డ్‌మెడల్ అవార్డును అందుకుంటున్న తిప్పయ్యస్వామి

ఎంపీ డీకే అరుణకు భద్రత పెంచాలి

ధన్వాడ: ఎంపీ డీకే అరుణకు భద్రత పెంచాలని బీజేవైఎం రాష్ట్ర నాయకులు ప్రవీణ్‌రెడ్డి అన్నారు. అర్ధరాత్రి ఒక అంగతకుడు పాలమూరు ఎంపీ అరుణమ్మ ఇంట్లో చొరబడడంపై రాష్ట్రంలో ప్రస్తుతం శాంతిభద్రతలు ఏవిధంగా ఉన్నాయో అర్ధమవుతుందని, నిందితుడిని త్వరగా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ అరుణకు భద్రతను పెంచాలని రాష్ట్రా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వర్గీకరణ చేపట్టకుండా ఫలితాలు విడుదల సరికాదు



దామరగిద్ద: ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలు విడుదల చేయడం సరికాదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాములు, నరేందర్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు ఆదివారం ఐదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వత్తుగుండ్ల గ్రామ దళిత నాయకులు దీక్షల్లో పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సప్ప, గలజప్ప, మాణిక్యప్ప, లక్ష్మప్ప, గోపాల్, నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రుల దిష్టిబొమ్మలు దహనం

- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ నాయకుల నిరసన
- ప్రధాన రహదారిపై ధర్నా, పట్టణాల్లో ర్యాలీలు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై చర్య తీసుకోవాలని డిమాండ్



కోస్గి బీఆర్‌ఎస్ నేతల దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: అసెంబ్లీ సాక్షిగా దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను ఏకవచనంతో సంబోదిస్తూ అవమానించడం రాజ్యాంగపరంగా హేయమైన చర్య అని, ఈ చర్యలకు పాల్పడిన బీఆర్‌ఎస్ నేత మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధిష్టానం పిలుపు మేరకు ఆదివారం స్పీకర్‌కు మద్దతుగా కోస్గి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మహబూబ్‌నగర్–తాండూర్ ప్రధాన రహదారిపై శివాజీ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండుమాల్ మండల కేంద్రంలో..

గుండుమాల్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ, పలు దళిత సంఘాల ఆధ్వర్యంలో స్పీకర్‌కు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీఆర్‌ఎస్ నేతల దిష్టిబొమ్మలను దహనం చేశారు.


⇨ మద్దూరులోని పాతబస్టాండ్ చౌరస్తాలో, కొత్తపల్లి చౌరస్తాలో జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.

⇨ నర్వ అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించి, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.


⇨ మరికల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలు దహనం చేశారు.

⇨ ధన్వాడ మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.

⇨ దామరగిద్ద అంబేడ్కర్ చౌరస్తాలో జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.



నర్వలో జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు



మరికల్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దివ్యాంగుల డిమాండ్లు పరిష్కరించాలి

మాగనూర్: స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కోసం చట్ట సాధనకు దశల వారీగా ఉద్యమం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. ఆంజనేయులు, ఎన్ఆర్‌పీడీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశప్ప, మండల అధ్యక్షుడు బాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వికలాంగుల లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేయడానికి వీలుగా ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 1నుంచి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రవికృష్ణ, వెంకటమ్మ, నరసమ్మ, నర్సింహులు, సలీం, నర్సింహులు, నరేష్, సూర్యనారాయణ, మారెప్ప పాల్గొన్నారు.



మాగనూర్‌లో దివ్యాంగుల సంతకాల సేకరణ చేస్తున్న సభ్యులు

ధ్యానం ఆధ్యాత్మికతకు తల్లి లాంటిది

నర్వ: ధ్యానం ఆధ్యాత్మికతకు జన్మనిస్తున్నందువల్ల తల్లిలాంటిదని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ జోనల్ కోఆర్డినేటర్ ఎస్‌వీ కృష్ణారావు అన్నారు. నర్వలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణలో 3 రోజుల పాటు నిర్వహించిన ధ్యాన మహోత్సవ ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం ధ్యానం చేయాలని, తద్వారా అంతర్గత శాంతి నుంచి ప్రపంచ శాంతి వైపు అడుగులు వేయాలన్నారు. ప్రతి ఒక్కరు ధ్యానం అలవాటు చేసుకొని ఆరోగ్యకరమైన జీవితాలను గడపాలన్నారు. కార్యక్రమంలో శ్రీరామచంద్ర మిషన్ మాస్టర్స్ గద్దె ఆంజనేయులు, నారాయణరెడ్డి, శివకుమార్, ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.



నర్వలో ధ్యాన మహోత్సవంలో మాట్లాడుతున్న హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ జోనల్ కోఆర్డినేటర్

మద్యం తాగి వాహనాలు నడపరాదు

నారాయణపేట: జిల్లా కేంద్రంలో ఏఎస్ఐ అంజిలయ్య ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. పలు వాహనదారులకు బ్రీత్ అనలైజర్‌తో డ్రంకెన్ కండిషన్ తనిఖీ చేసి 5 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. కేసులు పునరావృతం అయితే వాహనాన్ని సీజ్ చేయడం, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు.



వాహనదారులకు బ్రీత్ అనలైజర్ తో డ్రంకెన్ కండిషన్ తనిఖీ చేస్తున్న పోలీసులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దామరగిద్ద: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2012–2013 సంవత్సరం పదోతరగతి విద్యార్థులు ఆదివారం సంజయ్ ఫామ్‌హౌస్‌లో ఆత్మీయ సమేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన గురువులను ఆహ్వానించి శాలువా పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ్యులు సీతారాములు, కన్యప్ప, నాగార్జున్‌రెడ్డి, రమేష్, రాములు, సుఖ్‌దేవ్, మల్లికార్జున్, లక్ష్మణ్‌గౌడ్, బిచ్చయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



పూర్వ ఉపాధ్యాయులతో విద్యార్థులు

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం

నవాబుపేట: మండలంలోని పల్లెగడ్డ సమీపంలో వేలసిన స్వయంభూ ఆదిబసవేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. నందికోలసేవ నిర్వహించిన శివభక్తులు అగ్నిలో నడుస్తూ భక్తిని చాటుకున్నారు. అనంతరం స్వామివారి ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం

జాతరలో భాగంగా బసవేశ్వర దేవాలయం ఆవరణలో పల్లెగడ్డ యూత్ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా 27జట్లు పాల్గొనగా ఈటోర్నీ రెండు రోజులు జరగనుంది. విజేతలకు మాజీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రతాప్, సత్యం, రాములు, నేషనల్ రెఫరీ మల్లేష్, స్టేట్ కోచ్ ముస్తఫా, శ్రీనివాస్, బాల్‌రాజ్, శివ, గోపాల్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో మాట్లాడుతున్న నిర్వాహకులు

'పల్లె ప్రకృతి వనం' ఎండుతోంది

కొత్తకోట రూరల్: గత ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం గ్రామాల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. సర్పంచ్‌ల పదవీకాలం ఉన్నప్పటికీ వరకు పల్లెప్రకృతి వనాల నిర్వహణ బాగుండేది. సర్పంచ్‌లు లేకపోవడంతో వాటిని నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వడంతో వారు ఇతర పనిభారంతో పల్లెప్రకృతి వనాల నిర్వహణను పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం 'పల్లెప్రకృతి వనం'లో మొక్కల నిర్వహణ గాలికి వదిలేశారు. పల్లెప్రకృతి వనంలో మామిడి, ఉసిరి, సీతాఫలం, దానిమ్మ, వేపా తదితర మొక్కలు నాటారు. ప్రకృతి వనాన్ని అందంగా తీర్చిదిద్దుతామని ప్రారంభంలో అధికారులు చెప్పినప్పటికి ప్రస్తుతం నిర్వహణ లేకపోవడంతో ప్రకృతి వనంలో మొక్కలన్ని ఎండిపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో బోర్లు పనిచేస్తున్నప్పటికీ నీళ్ల పట్టడం లేదు. మరికొన్ని గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ మొత్తం గాలికి వదిలేశారు. పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేసి లక్షలాది రూపాయలు వెచ్చించినా లక్ష్యం చేరడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని వడ్డెవాటలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోతున్నాయి. కొంత కాలంగా అధికారులు పట్టించుకోకపోవడంతో గేటు సైతం విరిగిపోయింది. దీంతో పశువులు, మేకలు, గొర్రెలు అందులోకి వెళ్తున్నాయి. దీంతో మొక్కలు విరిగిపోయేందుకు అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి గేటు సరిచేయడంతో పాటు మొక్కలు ఎండిపోకుండా నీళ్ల పట్టే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వడ్డెవాట గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో ఎండిపోతున్న మొక్కలు



పల్లెప్రకృతి వనానికి విరిగిపడిన గేటు

శబరిమల నుంచి మొదటి ఇటుక

కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణ శివారులో సర్వాంగ సుందరంగా నిర్మిస్తున్న గర్భాలయ నిర్మాణానికి మొదటి ఇటుకను శబరిమల దేవస్థానం తరఫున ఆలయ ప్రధాన తంత్రి కందరరు రాజీవరు, ప్రధాన అర్చకులు అరుణ్ కుమార్ నంబూత్రిలు పంబా నదీ జలాలతో శుద్ధిచేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప సేవాసమితి అధ్యక్షులు ధూపం నాగరాజుకు అందజేశారు. ఆలయ నిర్వాహకులు పాగాకు రాఘవేంద్ర ప్రసాద్, విశ్వ మోహన్‌చారి, ప్రముఖ మేకప్‌మెన్ వేణు, గుడిబండ నాగిరెడ్డి, గన్నోజి వెంకటేష్ ఉన్నారు.

